కథ

# సగటు మనిషి

**డి.కామేశ్వరి**

కాలింగ్ బెల్ విని తలుపు తెరిచిన పార్థసారథి ఎదుట నవ్వుతూ నిలబడ్డ ఆమెని తెల్లపోతూ చూశాడు. పచ్చని పసిమిరంగు, క్లిప్ పెట్టిన తెల్లజుత్తు, కళ్లజోడు- కంచి కాటన్ పెద్దపమిటంచు చీర, అదే అంచు జాకెట్టు, భుజాన ఖాదీషోల్డర్ బ్యాగు... అరవై పైబడిన స్త్రీ..ఒక్క క్షణం అలాచూసిన ఆయనకి ఫ్లాష్ వెలిగినట్టు ఓ జ్ఞాపకం!

''సంస్కృతీ'' తడబడుతూ అన్నారాయన. ఆమె మొహం విప్పారింది. నవ్వుతూ.

''అమ్మయ్య గుర్తుపట్టావు..థాంక్ గాడ్..నన్ను చూసి గుర్తుపట్టలేవనుకున్నాను. లోపలికి రావచ్చా''

''ఆ..ఆ..రా, రండి..రండి..ఎన్నాళ్లు, ఎన్నేళ్లయింది చూసి, నలభై ఏళ్లా, ఏభై ఏళ్లా..అమెరికా వెళ్లిపోయాక చూడనే లేదు గదా..చాలా సంతోషం. నన్ను గుర్తుంచుకుని యిలా రావడం'' సోఫా చూపిస్తూ ఆహ్వానించారాయన.

''అండీ ఏమిటి, కొత్తగా ఏమిటా పిలుపు..అంత పరాయిదాన్ని చెయ్యకు'' అలిగినట్టు అంది కూర్చుంటూ.

''బావుంది..అపుడు స్టూడెంట్స్‌మి, యిప్పుడు డెభై ఏళ్లు వచ్చాయి. అలా ఎలా అనగలను'' నవ్వి ''అదిసరే..యిన్నాళ్లు..యిన్నేళ్ల తరువాత యిప్పుడు నేను ఎలా గుర్తు వచ్చాను..నేనిక్కడ వున్నానని ఎలా తెల్సింది..అమెరికాలోనే వుంటున్నారా శలవలకి వచ్చారా'' ప్రశ్నలు కురిపించారు.

''ఆగాగు, గుర్తురావడం ఏమిటి, అసలు మర్చిపోతే గదా గుర్తు తెచ్చుకోడం..నీవెక్కడ వున్నావ్..ఏం చేస్తున్నావ్, ఎలా వున్నావ్..నీ పెళ్లి, పిల్లలు, ఉద్యోగం, ఇక్కడ స్థిరపడడం, నీ వైఫ్ పోవడం..ప్రతి ఒక్కటి నీ గురించిన సంగతులు తెలుసు నాకు'' ఉద్వేగంగా అంది సంస్కృతి.

పార్థసారథి తెల్లపోతూ చూశాడు.

''ఎలా ఎలా తెలుసు? నాకసలు నీ గురించే తెలియదు. నీవు యు.ఎస్. వెళ్లాక నీ గురించే వినలేదు'' ఆశ్చర్యంగా అన్నాడు.

''అదేమరి నీకు నాకు తేడా..మీ మగవాళ్లు వుత్త అవకాశవాదులు. ఆడవాళ్లు అలా కాదు. ప్రేమించిన వ్యక్తిని అంత తొందరగా మర్చిపోరు''

పార్థసారథి తెల్లపోతూ చూసారు. ''అదేమిటి'' అయోమయంగా చూశాడాయన.


సంస్కృతి అల్లరిగా నవ్వింది. ''అదంతేలే..చెప్పాగా మీ మగవాళ్లు..''

''ఇదన్యాయం. నీ మనసులో ఏముందో నాకెలా తెలుస్తుంది. ఈ ప్రేమ ఏమిటి, ఎప్పుడూ వినని విషయం చెపుతున్నావు. అదీ ఏభై ఏళ్ల తరువాత- ఈ ముసలి వయసులో ఈ ముచ్చట ఏమిటి!'' అయోమయంగా అడిగారాయన.

''ఏం నిన్ను ప్రేమించకూడదా'' చిలిపిగా నవ్వింది.

''ప్రేమిస్తే మరి అప్పుడేం చెప్పలేదుగా..యిప్పుడేమిటి''

''అదంతేలే..నన్ను నేను తెల్సుకునేసరికి టూ



**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

లేట్ అయింది. నా మనసే నాకు తెలియలేదు. ఆ పై నీ మనసేమిటో చెపుతావనుకుని ఎదురుచూసే సరికి చేయిజారిపోయావు'' నవ్వుతూ చూసింది.

ఇంకా అర్థం కానట్టే చూశాడాయన. ''ఏయ్ పార్వూ..ముద్దబ్బాయిలా ఆ వెర్రిచూపులేమిటి! ఒకే గతం గతః- కాలాన్ని వెనక్కి తిప్పలేం గదా..గతం మరిచిపో, భవిష్యత్తు గురించి ఆలోచిద్దాం''

''భవిష్యత్తా! యింకా మనకు భవిష్యత్తేం మిగిలింది. రేపో మాపో రాలడానికి సిద్ధంగా వున్న ఆకులం- ఈ వయసులో రోగాల బారినపడి మంచాన పడకుండా హాయిగా దాటిపోవాలన్నదే కోరిక తప్ప యింకే ఆలోచనలు లేవు''

''అబ్బ, అచ్చు ముసలాడిలా మాట్లాడుతున్నావు. ఒకే నీకు డెబ్బై రెండేళ్లు వచ్చాయి. నాకు డెభై...నీ వయసు శరీరానిదా, మనసుదా!''

## దటీజ్ రమ్య!

**హీరోయిన్ నుంచి అత్త పాత్రలు, ఐటమ్ నంబర్లకి షిఫ్ట్ అయిన రమ్యకృష్ణ కొంత కాలం బుల్లి తెరపై కూడా కనిపించింది. కొంత కాలంగా ఎక్కడా కనిపించకుండా వున్న రమ్యకృష్ణ తిరిగి మరో ఇన్నింగ్స్ మొదలెడుతోంది. తెలుగులో నాగబాబుకి జంటగా 'సర్కార్' చిత్రంలో నటిస్తున్న రమ్యకృష్ణ తమిళంలో మరోసారి 'నరసింహ' సినిమాలోని 'నీలాంబరి' లాంటి పాత్రని పోషించబోతోందిప్పుడు. ఈ సినిమాతో రమ్య మరో సంచలనం సృష్టిస్తుందేమో!**



అర్థంకానట్టు చూసి అంతలోనే జవాబు తట్టి ''శరీరంలో భాగమేగా మనసూ వయసు దానికీ వుంటుంది''

''అది నేను ఒప్పుకోను. మనసుకి వయసేమిటి, నిత్యనూతనంగా వుంటుంది. మనసు, ఆత్మ వీటికి మరణం లేదంటారు గదా!'' రెట్టించింది.

''ఏమో నాకలా అనిపించదు. మనసుకీ వయసుంటుంది. మన మనసు పదేళ్లప్పుడు ఆలోచించినట్టు, యిరవయ్యేళ్లకి ఆలోచిస్తుందా..యిరవైలో ఆలోచించినట్టు నలభైలో- నలభైలో, అరవై ఏళ్లలో ప్రతి దశలో మన ఆలోచనలు మారవూ. అంటే శరీరంతో పాటు మనసూ ఎదుగుతుందనీ, మారుతుందంటాను నేను. ఇప్పుడు ఈ వయసులో మనం ప్రశాంతజీవనం కోరుకుంటూ బతుకుదాం అనుకోడం మనసూ అలిసిపోయి విశ్రాంతి కోరుకుంటోంది అని గదా!''

సాలోచనగా చూసింది సంస్కృతి ''నాకెందుకు మరి అలా అనిపించడం లేదు. జీవితంలో ఇదివరకు పొందనిది యిప్పుడేనా పొందాలని ఆరాటపడ్తోంది''

పార్థసారధి వింతగా అర్థంకానట్టు చూశారు. మనసులో ఏదో భయంలాంటి అలజడి. ఈ సంస్కృతి ఏమిటి యిలా మాట్లాడుతుంది..ఊరికే సరదాగా ఆట పట్టిస్తున్నట్టుంది. ఆయన మనసుకి సర్ది చెప్పుకున్నాడు.

''సరేలే అవన్నీ వదిలేయి. నీ గురించి చెప్పు..మీ వారేం చేస్తారు. పిల్లలు పెద్దవాళ్లయ్యారా..అమెరికాలో సెటిల్ అయినట్లేనా..ఇక్కడికి ఎప్పుడు వచ్చావు. నీ సంగతులన్నీ చెప్పు'' కుతూహలంగా అడిగారు.

''కాంతమ్మగారూ..కాస్త కాఫీ చేస్తారా..దాంతోపాటు ఏ బజ్జీలో పకోడీలో కాస్త చేసిపెట్టండి..స్నేహితులు వచ్చారు'' వంటింటి వైపు వెళ్లి అన్నారు.

అంతవరకు తలుపుచాటునుంచి కుతూహలంగా చూస్తున్న కాంతమ్మ ''అలాగే బాబూ, చేసి పట్టుకొస్తా పది నిమిషాలలో'' అంది.

''ఊ...వంటావిడని పెట్టుకుని కాలక్షేపం చేస్తున్నవన్నమాట. ఇక్కడింకా యిలాంటి సదుపాయాలున్నాయి చక్కగా. అక్కడ ఓపికున్నా లేకపోయినా అన్నీ మనమే చేసుకోవాలి''

''శకుంతల పోయి రెండేళ్లయింది. పిల్లలు అమెరికా రా అంటూ ప్రాణాలు తీస్తారు. నెలరోజులకంటే వుండలేక వచ్చేస్తాను. అదృష్టవశాత్తూ కాంతమ్మగారు, నన్ను కనిపెట్టుకుని వుండే ఆమె దొరికింది. ఏదీ యిబ్బంది లేకుండా గడిచిపోతున్నాయి రోజులు...అదిసరేగాని నీ గురించి ఏం చెప్పనే లేదు..మీవారు, పిల్లలు?''

సంస్కృతి నవ్వింది..''వారు..పిల్లలు..ఏం చెప్పాలి వాళ్ల గురించి, అలాంటి వారెవరన్నా వుంటేగా చెప్పడానికి''

''అదేమిటి పెళ్లి చేసుకోలేదా!'' తెల్లపోతూ అడిగారాయన.

''లేదు''

''అదేమిటి! ఎందుకలా వుండిపోయావు. నచ్చిన వారెవరూ దొరకలేదా!''

''నచ్చినవారు చేజారిపోయారు'' చిలిపిగా అంది. పార్థసారధి మొహంలో కలవరపాటు. కొంత అర్థమయి అవనట్టు ఆమె మాటలకి గాబరా పడి వంటింటి వైపు చూశాడాయన. పకోడీలు తెస్తూంది కాంతమ్మ. ప్లేట్లు మంచినీళ్లు పెట్టి ''కాఫీ కాస్త ఆగి కలపనా బాబుగారూ'' అంది కుతూహలంగా సంస్కృతినే గమనిస్తూ.

''ఆ..అ..పది నిమిషాలాగి తెండి'' అన్నారాయన.

సంస్కృతి తన ప్లేటందుకుని ''ఏమిటి పకోడీలు పెట్టి పంపించేయాలనుకుంటున్నావా..అదేం కుదరదబ్బాయి పెట్టే బేడాతో వచ్చాను వుందామని..మీ యిల్లు వెతికాక హోటల్నించి సామాను తెచ్చుకుందామని వదిలేశా''

ఆమె మాటలు వినగానే ఆయనకి కాస్త గాబరా అనిపించింది. ఆడదిక్కులేని సంసారం..సంస్కృతి యిక్కడొచ్చి వుంటాననుంది. సందిగ్ధంలో వుండగానే-

''నిజంగానే వుందామని వచ్చానయ్యా బాబూ, నీవుండగా హోటలు ఖర్మేందుకు?''

''ఆ..ఆ..తప్పకుండా వుండచ్చు దానికేం'' మనసులో యిబ్బందిగా వున్నా పైకి నవ్వుతూ అన్నారాయన. ''ఈ వూర్లో వున్న నాల్గు రోజులు తప్పకుండా యిక్కడే వుండచ్చు. కాంతమ్మగారున్నారు నీకేం కావాల్సినా చూసుకుంటుంది''

''నాలుగు రోజులేనా శాంక్షన్

చేశావు..సపోజ్..నాకిక్కడే వుండాలనిపిస్తే..వుండనిస్తావా'' కాంతమ్మ కాఫీలతో రావడం చూసి యింగ్లీషులోకి సంభాషణ మార్చింది.

పార్థసారధి మొహంలో కలవరం..యిదేమిటి బాబూ! ఈ సంస్కృతి యిలా అంటుంది. ఆమె ఏం మారలేదు..అప్పుడూ అంతే, స్టూడెంటుగా వున్నప్పుడూ అంతే..చెప్పాపెట్టకుండా రూముకొచ్చేది..ఆకలేస్తోంది తినడానికేముంది అనేది. కాస్త ఓ అరగంట పడుకుని వెడతానంటూ పక్కమీద వాలిపోయేది. ఎవరన్నా చూస్తే ఏం అనుకుంటారోనని హడాలిపోయేవాడు. యిప్పటికీ యిదే పద్ధతిలో వుందే అనిపించింది. జవాబేం తట్టక నవ్వేశారాయన కాఫీ తాగుతూ.

''హోటలుకెళ్లి సామాను తీసుకువద్దామా'' అంది కప్పు కిందపెడ్తూ.

''ఏమిటి నిజంగానే అంటున్నారా..అమెరికా స్టాండర్డ్ యిల్లు కాదు నాది..అలవాటు లేని చోట వుండగలవా'' కాస్త బిడియంగా అన్నాడాయన.

''మహానుభావా..యిల్లు కాదు నాకు కావాల్సింది.. మనుష్యులు..అమెరికా వైభోగాలన్నీ అనుభవించి విసుగు పుట్టిందిలే..యిప్పుడీ యిండియన్ పూరిగుడిసైనా మహారాజులా వుండగలను. ఆ భోగభాగ్యాల కోసం యిక్కడికి రానవసరం లేదుగా..నాకే యిబ్బంది లేదు. నీకేమన్నా యిబ్బందా, ఫ్రాంక్‌గా చెప్పు''

''అబ్బే లేదు..లేదు..హోటలుకి నేనెందుకు, ఈలోగా నీ రూము సర్దించి రెడీ చేస్తాను. టాక్సీ వుందిగా వెళ్లిరా''

''సరే..ఓ గంటలో వస్తా'' అంటూ వెళ్లిపోయింది.

ఆయన ఒక్క నిమిషం దిగాలుపడిన వాడిలా కూర్చుని, ''కాంతమ్మ గారు..నర్సమ్మ వుంటే ఓసారిటు రమ్మనండి..ఆ చూడండి...చాలా రోజుల తరువాత మాకు కావాల్సిన యీవిడ అమెరికానించి వచ్చారు. ఇక్కడ కొన్నాళ్లుంటారుట. కాస్త ఆవిడున్నన్ని రోజులు వంటలవి ఆవిడకి కావాల్సినట్టు చేసిపెట్టండి. కారాలవి తింటుందో లేదో అడగండి. రాత్రికి వంట సంగతి చూడండి'' గది సర్దించడానికి వెళ్లారు.

పనిమనిషికి చెయ్యాల్సినవి చెప్పి సోఫాలో వాలిపోయారాయన. ఏదో అలజడి, కాస్త బెరుకు, మరికాస్త సందిగ్ధత ఆయనని చుట్టుముట్టాయి.

ఏదో తన రొటీన్ తను ఏర్పరచుకుని ప్రశాంతంగా బతుకుతూంటే యిప్పుడీవిడ యిలా రావడం ఏమిటి! ముందునించి సంస్కృతి విచిత్రమైన మనిషే..యిరవై ఏళ్ల స్టూడెంట్‌గా ఎలావుందో డెబ్భై ఏళ్లొచ్చినా ఆమెలో మార్పు లేదు. అప్పుడూ యిప్పుడూ తనకి అర్థంకాని మనిషే!

సంస్కృతి..ఎప్పుడూ వినని పేరు..ఆ పేరే అందరిలో ఆనాడు కుతూహలం కలిగించింది..పేరులాగే ఆమె కూడా మిగతావారికంటే భిన్నంగా వుండేది. ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మే యింగ్లీషులో జాయిన్ అయింది. బి.ఏ. వరకు కలకత్తా 'శాంతినికేతన్'లో చదివిందట! తండ్రి బ్రిటిష్‌వారి కాలంలో ఓ ఆయిల్ కంపెనీ మేనేజరుగా కలకత్తాలో పెద్ద ఉద్యోగం! వైజాగ్ ట్రాన్స్‌ఫర్ మీద వచ్చారుట. అప్‌లాండ్స్‌లో పెద్ద బంగళా.. బట్లర్లు, నౌకర్లు, చాకర్లు హంగామా అంతా వుండేది. సంస్కృతి తండ్రి బ్రిటిష్ కంపెనీలో పనిచేస్తున్నా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలని పాటించే మనిషిట. ఉదయం గాయత్రి చేస్తే కానీ కాఫీ కూడా తాగరట. కూతురిని కూడా చక్కని సాంప్రదాయంగా పెంచేరుట. సంస్కృతి వేషం కూడా అడుగడుగునా భారతీయత ఉట్టిపడేది. మంచి పసిమిరంగు. ఎప్పుడూ చేనేత అంచున్న చీర అదే బోర్డరున్న జాకెట్లు, నుదుట పెద్దబొట్టు, బారెడు జడ-ఆకు చెప్పులు. భుజాన ఖాదీ షోల్డర్ బ్యాగు..వేషం సాంప్రదాయంగా వున్నా అద్భుతమైన యింగ్లీష్ మాట్లాడేది. మిగతా అమ్మాయిలందరికంటే వేషభాషల్లో భిన్నంగా వున్న సంస్కృతి గురించి అందరూ వింతగా చూసేవారు. చెప్పుకునేవారు యూనివర్సిటీలో..ఆమె ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూండేది. నాది ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్..ఆమెది ఇంగ్లీష్..యిద్దరం కలిసే అవకాశం లేదు. మగపిల్లల మాటల ప్రభావంతో లైబ్రరీలో పుస్తకాల ముందున్న ఆమెని మొదటిసారి చూశాను. చూడగానే ముందు తట్టేది ఆమె అద్భుతమైన అందం..విలక్షణమైన ఆకృతి..ఏదో అనిర్వచనీయమైన అనుభూతి. అందరూ ఆమె గురించి ఎందుకు ప్రత్యేకంగా చెప్పుకుంటున్నారో అర్థం అయింది. అయస్కాంతంలాగా తెలియకుండానే ఇంగ్లీషు డిపార్ట్‌మెంటు లేదా లైబ్రరీ వరండాలు పట్టుకు వేలాడే వారిలో నేనూ జత అయ్యాను.

సాహిత్యంపట్ల నాకున్న అభిలాష, అభిరుచి యిద్దరినీ దగ్గర చేసింది. రెండు నెలల్లో పుస్తకాలతో మొదలైన పరిచయం యూనివర్సిటీలో వున్న రెండేళ్లలో చాలా దగ్గరయ్యాం.

ఆమె మనతో ఎంతో చనువుగా మాట్లాడినా మనల్ని హద్దు దాటనివ్వని వ్యక్తిత్వం ఆమెది! గౌరవం తప్ప చులకన భావం కలగనీయనంత సంస్కారవంతమైన ప్రవర్తన! ఆమె స్నేహానికి స్త్రీ, పురుష భేదం లేదు. నిస్సంకోచంగా రూముకొచ్చేది. గంటల తరబడి మాట్లాడేది. సినిమా కెడదామా, బీచ్‌కి వెడదామా అనేది. ఎంత చనువిచ్చినా గీత దాటగలిగే సాహసం ఎవరికి వుండేది కాదు.

మామూలు మధ్యతరగతి సంసారంలో



## నయనతారకి కోటి!

హీరోయిన్‌కి కోటి రూపాయల రెమ్యునరేషన్ అంటే అది వార్తే మరి. ఆమధ్య కత్రినా 'మల్లీశ్వరి' కోసం కోటి తీసుకుందని చెబితే తాజాగా 'భలేదొంగలు' సినిమాకి ఇలియానా పారితోషికం కోటి మార్కుని టచ్ చేసిందని ఘనంగా చెప్పుకున్నారు. ఇప్పుడు తమిళ నాట కోటి రూపాయల తారగా ఖ్యాతికెక్కనున్నది నయనతార. ప్రభుదేవా దర్శకత్వంలో విజయ్ హీరోగా నిర్మాణం కానున్న సినిమాలో హీరోయిన్‌గా నటించేందుకు నయనతారకి కోటి రూపాయలు ముడుతున్నాయని కోలీవుడ్ కోడై కూస్తోంది.

పుట్టిన నేను కన్నెత్తి చూడలేనంత తేడా అనిపించి ఆమె అందాన్ని, విద్వత్తుని మనసులో ఆరాధించడం తప్ప యింకో ఆలోచనే రాలేదు. చదువయి, డాక్టరేట్ చేసి యూనివర్సిటీలో ప్రొఫెసరునయి తాహతుకి తగిన అమ్మాయిని చేసుకుని జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా గడిపిన నాకు సంస్కృతి నా ఊహలలోకి రాలేదు.

ఇప్పుడిలా! యిన్నేళ్ల తరువాత నా జీవితంలోకి రావడం.

★ ★ ★

''సంస్కృతీ, నీవు నానుంచి ఏం ఆశిస్తున్నావో నాకు సరిగా అర్థం అయ్యేట్టు చెపుతావా''

సంస్కృతి వచ్చి పదిరోజులయింది. హాయిగా ఎప్పటినుంచో వున్న యింటి మనిషిలా అమిరిపోయింది. వెళ్లే ప్రసక్తే లేదు. ఎన్నాళ్లుంటుందో, ఎప్పుడు వెళ్తుందో అడగడానికి సతమతమవుతూ, ఎవరేం అనుకుంటున్నారోనని బిడియపడ్తూ, ఆఖరికి ఏదోఒకటి తేల్చుకోవాలన్న తెగింపుతో అడిగాడాయన. సంస్కృతి ఆశ్చర్యంగా చూసింది.

''ఏమాశిస్తున్నానని నీ వనుకుంటున్నావు?'' ఎదురుప్రశ్న వేసింది.

''అది తెలియకనే గదా అడిగింది'' ఉడుక్కున్నట్లన్నాడు. సంస్కృతి నవ్వింది.

''గత వారం పది రోజుల నించి మనం ఏం చేస్తున్నాం. అదే నేనాశించేది నీనించి. అంతకుమించి ఏం అవసరం లేదు నాకు'' నిదానంగా ఆయనవంకే చూస్తూ అంది.

అర్థంకానట్టు చూశారు పార్థసారథి.

''చూడు పార్థూ..తొలివెలుగులో ఉదయాన్నే నీతో సమంగా వాక్‌కి వస్తున్నాను. తిరిగొచ్చి ఈ వరండాలోనే కాఫీ తాగుతూ పేపరు చదువుతూ వార్తలు పంచుకుంటున్నాం. కల్సి టిఫిను చేస్తాం. చెస్ ఆడుకుంటున్నాం. ఆడుతూ దేని గురించో వాదించుకుంటున్నాం. భోజనాల దగ్గరా కబుర్లే...కాసేపు విశ్రాంతి..సాయంత్రం వ్యాహ్యాళి - నీ సీనియర్ సిటిజన్స్ గ్రూపులో నేనూ కలిసొగా..తిరిగొచ్చి కాసేపు టి.వి. భోజనం తరువాత యీ వెలుగు నీడల వరండాలో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, బాలమురళీ, పాత హిందీపాటలో వింటూ తన్మయులవుతూ




పాత జ్ఞాపకాలు కలబోసుకోవడం- చెరో పుస్తకం చదువుకుంటూ భావాలు పంచుకుంటూ మంచి స్నేహితుల్లా రోజంతా గడుపుతున్నాం..అదే అంతా..నీ నించి నేను ఆశించేది. పార్థూ నాకు నా స్థాయిలో ఆలోచించగలిగే మనిషి సహచర్యం కోసం పరితపించాను. ఓ కవిత చదివి స్పందించే హృదయం, ఓ జోక్ వేస్తే సెన్సాఫ్ హ్యూమర్‌తో ఆనందించగలగడం, ఓ మాటకి రిటార్ట్ యివ్వగలిగినంత తెలివి, గడుసుదనం - నా వేవ్‌లెంత్‌కి సరిపోయే జోడి. మనిషి సహచర్యం కోసం మొహం వాచిపోయి వచ్చాను. పెళ్లి చేసుకోలేకపోయావా అన్నావు చాలా సార్లు. నా ఆలోచనలని అర్థం చేసుకునే స్థాయి మనిషే దొరకలేదు. అప్పుడే నీ విలువ అర్థం అయింది. నేనేం వదులుకున్నానో తెల్సింది. నాన్న పెళ్లి పెళ్లి అని కలవరించిపోయారు. నీకోసం వాకబు చేస్తే నీ ఉద్యోగం నీ సంసారం గురించి తెల్సి నిన్ను నేను నా నిర్లిప్తత వల్ల దూరం చేసుకున్నందుకు బాధపడ్డాను. ఉద్యోగం, పుస్తకాలు, సంగీతం, నా సహచరులు, దేశాలు చుట్టి వచ్చాను. ఎక్కడా నాకు కావాల్సింది, కావాల్సిన మనిషి దొరకలేదు. రిటైరై పదేళ్లయింది. ఇంక అమెరికాలో వుండాలనిపించలేదు. మళ్లీ నీ గురించి వాకబు చేశాను. నీ భార్యపోయి ఒంటరిగా వున్నావని విన్నాను. ఇప్పుడు నీకు ఒంటరితనంలో బాధ అర్థమయి వుంటుంది. ఆలస్యం అయినా అప్పుడు పొందలేని నీ సహచర్యం పొందుదామనిపించింది. అంతే నాకు కావాల్సింది...అంతే అంతే'' ఉద్వేగంగా అంది.

''సారీ, నీ జీవితంలో వాక్యూమ్ నాకర్థం అయింది. కాని ఇది ఇండియా. ఎంత విదేశ సంస్కృతి అలవడినా యింకా ఓ ఆడ, మగ, డెభ్బై ఏళ్లున్నా యిద్దరు కలిసి ఓ యింట్లో వుంటే విచిత్రంగా చెప్పుకునే స్థాయి నుంచి యింకా దాటలేదు. ఈ పదిరో



## హిందీ హాసిని!

**బొమ్మరిల్లు సినిమాలోని హాసిని పాత్రతో తెలుగు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న జెనీలియా ఆ సినిమా తమిళ రీమేక్‌లో కూడా నటించి అక్కడా ప్లస్ మార్కులు కొట్టేసింది. ఇప్పుడు హిందీ బొమ్మరిల్లులో కూడా జెనీలియాయే నటిస్తోంది. శ్రీదేవి భర్త బోనీకపూర్ నిర్మిస్తున్న బొమ్మరిల్లు హిందీ వెర్షన్‌లో కథానాయికగా జెనీలియా నటిస్తోంది. ఇలా మూడు భాషల్లోనూ ఒకే పాత్రని పోషించడం ద్వారా జెనీలియా తన ప్రత్యేకత చాటుకుంటోంది.**

జులుగా పాలవాడు, పేపరువాడు, చాకలివాడు అంతా ఎంత వింతగా చూస్తున్నారో గమనించావా! మనిద్దరం కల్సి వాక్‌కి వెళ్తుంటే చుట్టుపక్కలవాళ్లు వింతగా చూస్తున్నారు. నా పిల్లలకీ సంగతి తెల్సి నాన్నకి ఈ వయసులో యిదేం పని అనుకోవచ్చు''

''చూడు..మిగతా వాళ్ల గురించి ఈ లోకం ఏమనుకుంటుందోనన్నది నాకనవసరం. నీ పిల్లలకి మన స్నేహం గురించి చెప్పు. నీవు చెప్పలేకపోతే నే చెపుతా''

''లోకం గురించి నీకక్కరలేకపోవచ్చు. లోకం నిన్ను పట్టించుకుంటుంది''

''అదిసరే, ముందసలు నీకే యిబ్బందిగా వున్నట్టుంది. పొమ్మని డైరెక్ట్‌గా చెప్పలేక యిలా చెప్తున్నావా'' ఆమె గొంతులో బాధ. ఆమె చూపులు తప్పించుకుని

''అలా అనకు, నీకెంత వంటరితనం అనుభవించి ఈ నిర్ణయానికి వచ్చావో అర్థం అయింది. కానీ ఓ పక్క యిలాంటివి మన దేశంలో అలవాటు లేక ఎవరం అపహాస్యం పాలవుతామేమోనని భయం. సరే ఆలోచిద్దాం, ముందు నన్ను నేను మెంటల్‌గా ప్రిపేరవనీ! అందుకు కాస్త సమయం పడ్తుంది. అర్థం చేసుకో!''

''సరేలేవయ్యా బాబూ! ఏదో నన్ను పెళ్లి చేసుకోమన్నట్టో, నీ ఆస్తిపాస్తులలో భాగం అడిగినట్లో బెంబేలు పడుతున్నావు'' తేలిగ్గా నవ్వుతూ అంది.

★ ★ ★

''నాన్నగారూ మీ 'ఇ-మెయిల్' చూశాం అన్నయ్యా, నేనూ. సంస్కృతీ ఆంటి కూడా అన్నీ వివరంగా పంపించారు. అన్నయ్య నేను చాలా థ్రిల్లింగ్‌గా ఫీలయ్యాం'' శరణ్య చాలా ఎగ్జైటింగ్‌గా అంది.

''థాంక్స్ అమ్మా! మీరే మనుకుంటారో, ఈ వయసులో యిదేం పని అని అనుకుంటారేమోనని భయపడ్డాను. శరత్ ఏమన్నాడు'' పార్థసారధి ఆరాటంగా అడిగారు. అవతల కాన్ఫరెన్స్ ఫోనులో వింటున్న శరత్- ''నాన్నగారూ..ఈ వయసులో వంటరిగా వున్న మీకు మంచి తోడు దొరకడం అదృష్టం అంటాను. మేం ఏం అనుకుంటాం...మమ్మల్ని అంత తక్కువ అంచనా వేయద్దు. అంటే మీ యిద్దరి గురించి ఎంత చక్కగా విపులీకరించి రాశారో, ఆవిడ సంస్కారం, భావుకత, పరిజ్ఞానం, కవిహృదయం ఆమె పంపించిన ఇమెయిల్‌తోటే అర్థం అయింది. అంత గొప్ప స్నేహితురాలు మీకు దొరకడం మా అదృష్టం అంటాను''

''కానీ శరత్, మా స్నేహాన్ని ఎంత మంది అర్థం చేసుకోగలరంటావు?''

''అదంతా వదిలేయండి నాన్న, యింకోరి గురించి మీకనవసరం. మీ భావాలు పంచుకుంటూ మనసువిప్పి మాట్లాడుకుని మీ వంటరితనం పాలుపంచుకునే మిత్రురాలిని వదులుకోకండి. నాన్నగారూ..యింకో విషయం- మీరు, ఆమె కావాలంటే, లోకం జంకువుంటే, పెళ్లి చేసుకున్నా మేం సంతోషిస్తాం'' శరణ్య అంది.

''వద్దు..వద్దు..పెళ్లి అనేసరికి హక్కులు, బాధ్యతలు..ఈ వయసులో ఆ బంధాలు వద్దనుకున్నాం''

''అయితే సరే! ఆవిడ్ని హృదయపూర్వకంగా యింట్లోకి ఆహ్వానించండి. మిమ్మల్ని చూడడాని కోసం అయినా ఈ శలవుల్లో తప్పకుండా వస్తాం'' యిద్దరూ ఒకేసారి అన్నారు. బైబై చెపుతూ..ఆయన ఫోనుపెట్టి వెనక్కి తిరిగేసరికి కాంతమ్మ నర్సమ్మ నిలబడి ఏదో చెప్పాలని ఆరాటపడ్డారు. ''ఏమిటి కాంతమ్మగారూ ఏం కావాలి'' కాస్త ఆశ్చర్యంగా అడిగారాయన. ఆవిడ కాస్త జంకుతూ తలదించుకుని

''బాబుగారూ..మేమో మాట చెపితే ఏం అనుకోరు గదా, చూడండి బాబుగారు..ఏణ్ణార్థం నుంచి యిక్కడ వుండి మీ మంచి చెడ్డా చూస్తూ యింట్లో మనిషిలా వున్నాను. నర్సమ్మ అయితే గత పదిహేనేళ్ల నుంచి మీ దగ్గర పనిచేస్తోంది. ఆ చనువుతో మీతో ఓ మాట చెప్పాలని..'' సందేహిస్తూ ఆగింది. కొంపదీసి యిద్దరూ పనిమానేస్తాం ఆవిడ యీ యింట్లో వుంటే అంటారా అన్న భయం ఒక్క క్షణం కనిపించింది.

''ఫరవాలేదు చెప్పండి''

''బాబుగారూ, యింట్లో వున్నాక జరుగుతున్నవి తెలియకుండా వుండవు. వద్దనుకున్నా కొన్ని మాటలు చెవిన పడకాపోవు. సంస్కృతి అమ్మ వచ్చిందగ్గర నుంచి ఆవిడ ఎంత మంచిమనిషో రెండు రోజుల్లోనే అర్థం అయింది. ఆవిడ యిక్కడ వుందామన్న ఆలోచనతో వచ్చారని, మీరే నలుగురూ ఏం అంటారో నన్న భయంతో వున్నారన్నది మాకు అర్థం అయింది. బాబూ వెధవలోకం ఏమనుకుంటే మీకేం బాబూ, మీ పిల్లలూ సంతోషంగా వప్పుకున్నాక యింకా ఆలోచన వద్దు. యింట్లో ఆవిడుంటే ఎంతో సందడిగా వుంది. మీకు తోడు నీడగా వుంటానని వచ్చిన ఆమెని వదులుకోవద్దు బాబూ''

''సరేలే ఆలోచిస్తున్నాను..చూద్దాం'' అంటూ గదిలోకి వెళ్లిపోయారు.

★ ★ ★

తెల్లారి కాంతమ్మ గాబరాగా ''బాబుగారూ అమ్మగోరు గదిలోలేరు. ఆమె సామాన్లు లేవు. ఇదిగో యీ ఉత్తరం మాత్రం వుంది. కాఫీ యిద్దామని వెడితే లేరు బాబూ'' ఆరాటంగా అంది. తెల్లబోతూ ఉత్తరం అందుకున్నారు పార్థసారధి,.

''పార్థసారధిగారూ- నేవెళ్లిపోతున్నాను. యిక్కడికి వచ్చి నేనెంత తప్పు చేశానో నిన్నటితో అర్థం అయింది. శ్రీరాముడంతటి ఏకపత్నీ వ్రతుడిగా మిగిలిపోవాలన్న నీ కోరికని నే కాదనలేదే! నీ శ్రీమతి స్థానం కోరలేదే! నే అడిగింది తోటిమనిషి తోడు! దానికోసం మీలో ఎన్ని అనుమానాలు, ఎంత సందిగ్ధత, ఎంత ఆలోచన, ఎన్ని ప్రశ్నలు! నర్సమ్మ, కాంతమ్మల కున్నంతపాటి కన్సరన్ అయినా లేదే మీలో. మీ పిల్లలకున్నంత సంస్కారవంతమైన ఆలోచనే లేదే మీలో! పరిగెత్తివచ్చి పిల్లలు వప్పుకున్నారు. నర్సమ్మ యిలా అంది, కాంతమ్మగారలా అంది అని సంబరంగా నా చేయిపట్టుకు ఊపుతూ అన్ని అడ్డంకులు తీరిపోయిన సంతోషం నీలో చూడాలన్న నా ఆశ- ఆ రాత్రంతా నాతో మాట్లాడకుండా నీ ఆలోచనతో నీ గదిలో కూర్చుని యింకా యింకా సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న నిన్ను చూశాక, యింత పిరికి సగటు మనిషికోసమా నేను పరిగెత్తి వచ్చాను. ఎంత తప్పుగా అంచనా వేసాను అన్న బాధతో నా మనసు చిన్నపోయింది. రేపుమనం కల్సివుంటే ఎవరో ఏదో అన్నారు, ఎవరో నవ్వారు అంటూ నొచ్చుకుంటూ కూర్చుంటావేమో! యిలాంటి చోట నేను స్వేచ్ఛావాయువులు ఎలా పీల్చగలను? నీ అభిజాత్యం నీ దగ్గరే వుంచుకో! సగటు మగాడిననిపించుకున్నావు. పదిహేనురోజుల మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు! శెలవు..సంస్కృతి''

ఉత్తరం చదివాక కలగాల్సినంత బాధ కలగకపోగా, మీదపడబోయే ఆపదేదో తప్పిందన్న భావనే కల్గింది ఆయనకి.

☆

